ఒకవైపు సమీక్షలు .. మరోవైపు హామీలు

వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శనివారం రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఒకవైపు పంట కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తూనే, మరోవైపు ప్రజల సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి హామీలిస్తూ, స్వయంగా వినతులు స్వీకరించారు. అలాగే మరోవైపు వైద్య సహాయం కోసం వచ్చిన వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, అధికారులు, ఉద్యోగులతో కార్యాలయం కిటకిటలాడింది.

ఖాకీల కష్టం తీరేదెప్పుడో..!

ఈ ప్రభుత్వంలోనైనా పోలీసుల కష్టాలు తీరేనా అంటూ ఆ శాఖలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పోలీస్ శాఖను తీవ్ర నిర్లక్ష్యం చేయడంతోపాటు వారికి అందాల్సిన సొమ్మును సైతం అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. పోలీసులకు వీక్లీఆఫ్ అమలును ఆర్భాటంగా ప్రారంభించి ఏడాది గడవకముందే తిలోదకాలు ఇచ్చేసింది. దీంతో ఈ ప్రభుత్వమైనా పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది.

- పోలీసులకు వీక్లీఆఫ్ అమలుపై టిడిపి కూటమి హామీ
- విజయవాడలో టర్మ్ విధులతో పోలీస్ సిబ్బంది నరకం
- పని భారం పెరిగి అనారోగ్య సమస్యలు తీవ్రం
- టిఎ, ఎస్ఎల్ఎస్ సొమ్ము సైతం సకాలంలో ఇవ్వని పరిస్థితి
- ఈ ప్రభుత్వంలోనైనా పోలీసులకు ఊరట లభించేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో అత్యంత దారుణంగా విమర్శలు ఎదుర్కొన్న శాఖల్లో పోలీస్‌శాఖ ఒకటి. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలను మూటగట్టుకుంది. అయితే గత ప్రభుత్వం పోలీస్‌శాఖకు మాత్రం చేసిందేమీ లేకుండాపోయిందని చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సిఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకూ దాదాపు మూడు వేల మంది వరకూ ఉన్నారు. ఒక్క ఈ జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత ప్రభుత్వం వీక్లీఆఫ్ అమలుపై చేతులెత్తేయడంతో సిబ్బందికి కుటుంబంతో గడిపే సమయం లేకుండాపోయింది. గడిచిన ఎన్నికల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే పోలీసులకు వీక్లీఆఫ్ అమలు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. ఈ హామీకి ఆర్థికంగా నిధులు వెచ్చించాల్సిన అవసరం లేదు. కాబట్టి వీక్లీఆఫ్ హామీ అమలు కోసం పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో టర్మ్ విధుల పేరుతో ప్రతి స్టేషన్ నుంచి నెలకు ఒక కానిస్టేబుల్‌కు విధులు కేటాయిస్తూ వస్తున్నారు. ప్రతి నెలా జిల్లా నుంచి నలుగురైదుగురు కానిస్టేబుళ్లు తాడేపల్లి, విజయవాడ ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తోంది. ఈ విధులు నెలలో 15 రోజులు ఉంటాయి. టర్మ్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అక్కడ విశ్రాంతి తీసుకోవడానికి, రాత్రి ఉండటానికి ఎటువంటి వసతులూ లేవు. దీంతో డార్మెటరీలో ఉండాల్సి వస్తోంది. దీంతో 15 రోజులకు తక్కువగా లెక్కించినా రూ.నాలుగు నుంచి రూ.ఐదు వేలు ఖర్చవుతోంది. చేతి సొమ్ము పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సి రావడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. విజయవాడలో వేసే టర్మ్ విధులను రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వీక్లీ ఆఫ్ లేకపోవడం, టర్మ్ విధులు, బందోబస్తులతో విశ్రాంతి లేక పోలీస్ సిబ్బందిలో అనారోగ్య సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా తమ మొర ఆలకించి టర్మ్ విధులను రద్దు చేయడంతోపాటు వీక్లీఆఫ్ అమలు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

కొత్తగా నియామకాలు లేవు.. చేసిన పనికి బిల్లులివ్వని దుస్థితి

పోలీసులకు వీక్లీఆఫ్ అమలు చేయాలంటే కొత్తగా కానిస్టేబుళ్ల నియామకం పెద్దఎత్తున జరగాల్సి ఉంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క నోటిఫికేషన్ కోర్టు మెట్లు ఎక్కి నిలిచిపోయింది. దీంతో ఎంతోమంది వయస్సు దాటిపోయి పోలీస్ ఉద్యోగానికి అర్హత కోల్పోయిన పరిస్థితి ఉంది. పోలీస్‌శాఖలో ఉద్యోగాల భర్తీ జరిగితే తప్ప పోలీస్ సిబ్బంది కష్టాలు తీరే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ఎప్పుడిస్తుందోనని యువత ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా 24 గంటలు నిద్రాహారాలు వదిలేసి పని చేస్తున్న పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన సొమ్ము సైతం గత ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రతినెలా టిఎ రూపంలో నెలకు రూ.2,100 ఇవ్వాల్సి ఉంది. పది నెలలుగా ఇవ్వని పరిస్థితి నెలకొంది. సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన సొమ్ము బకాయిలూ ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే పోలీసులను గత ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వమైనా తమ మొర ఆలకించి పోలీసుల సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు

జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ వద్ద జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్, విద్య, ఆరోగ్య, సాంఘిక సంక్షేమం, పౌర సరఫరాల శాఖల అధికారులతో విడివిడిగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని, దీనికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. జులై 1వ తేదీన నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగడానికి వీలులేదన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం వెంటనే క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులైన మండల స్థాయిలోని ఆర్‌ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, బిల్ కలెక్టర్లు, తదితర సిబ్బందిని పెన్షన్ల పంపిణీకి నియమించాలన్నారు. ప్రతి 50 మంది లబ్ధిదారులకు ఒక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. తహశీల్దార్ వెరిఫికేషన్ అనంతరం కుల ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల ద్వారా పొందొచ్చని తెలిపారు. పేద పిల్లలకు విద్యా పథకాలు అమల్లో విద్య, సాంఘిక సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్లు, ఆదరవు వసతి గృహాల్లో గదులు, లైట్లు ఏర్పాటు, తదితర అంశాలపై సమీక్షించారు. విద్యాలయాల్లో అర్హులైన వారికి ప్రవేశం కల్పించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూనే మిగిలిపోయిన సీట్ల విషయంలో అవసరమైన వారికి సీట్లు కేటాయించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో భాగంగా జిల్లాలో వరి విత్తనాల పంపిణీ, నారుమళ్ళు, నాట్లపై ఆరా తీశారు. తగినంతగా వరి నాట్లు పూర్తి చేయడానికి రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. విత్తనాల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎరువుల విక్రయ దుకాణాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమం అమలు, జిల్లాలో డయేరియా వ్యాధిబారిన పడిన వారి వివరాలు, వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాలో అన్ని మున్సిపాల్టీలు గ్రామ పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - పెనుగొండ

బాధితులను పరామర్శించి మాట్లాడుతున్న సుబ్బరాజు

కరెంటు తీగలు తొలగించాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యమే తన భర్త ప్రాణం తీసిందని కౌలురైతు భార్య తానేటి మరియమ్మ వాపోయారు. శనివారం వడలిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కౌలురైతు గంగయ్య కుటుంబాన్ని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా మతుడు కుమారుడు సోమేశ్వరరావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఉపయోగం లేని విద్యుత్ వైర్లను తొలగించాలని అధికారులకు పలుసార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారని తెలిపారు. చేలల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు తన తండ్రి పట్ల యమపాశంగా మారాయన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు కట్టించి ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, తొంటా సత్యనారాయణ, ఆవుల శ్రీనివాస్, రుద్ర రామాంజనేయులు పాల్గొన్నారు.

రీఛార్జ్‌ల మోతను అరికట్టండి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఉండి

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజల జేబులు కొల్లగొట్టి ఆదాయాన్ని పెంచుకునేందుకు చూస్తున్న సెల్ కంపెనీలపై ట్రాయ్ తగు చర్యలు తీసుకుని, రీఛార్జ్‌ల మోతను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం ఉండి మెయిన్ సెంటర్లో సిపిఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో జియో ఎయిర్టెల్ కంపెనీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ జియో, ఎయిర్ టెల్ కంపెనీలు ఇటీవల తమ టారిఫ్ రేట్లను సుమారు 20 శాతం పెంచుతున్నట్లు ప్రకటించడంతో ఆయా సెల్ కంపెనీల వినియోగదారులపై అదనపు భారం పడుతోందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో నిరుపేదల ఇళ్లు గడవడం కష్టమవుతోందని తెలిపారు. ప్రస్తుతం సెల్ కంపెనీలు లాభాపేక్షే ధ్యేయంగా టారిఫ్ ధరలు పెంచడం సరికాదన్నారు. ముఖేష్ అంబానీ జియో ప్రారంభించిన కొత్తలో కేవలం 149 రూపాయలకే నెలరోజుల పాటు అపరిమితంగా ఫోన్ కాల్స్, డేటా సౌకర్యం కల్పించే వారని తర్వాత కాలంలో సుమారు వంద రూపాయల వరకూ పెంచి వినియోగదారులు నడ్డి విరిచారని తెలిపారు. నేడు తిరిగి ప్రతి ఒక్కరూ బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారేందుకు సిద్ధమవుతున్నారని, కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ సేవలను పూర్తిస్థాయిలో విస్తరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చీర్ల శేషు, కొట్టాడ వెంకటేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాస్, రామకూరి వెంకటరత్నం, మునకాల రవిరాజు, మోపిదేవి రాము పాల్గొన్నారు.

హాస్టల్లో మున్సిపల్ కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని 19వ వార్డులోని బిసి బాలుర హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను, విద్యార్థుల పడక గదులను, భోజనశాలలను, మరుగుదొడ్లను, స్నానాలు గదులను పరిశీలించారు. అనంతరం తాగునీరు క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టల్ వార్డెన్ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో దోమల నివారణకు ఆయిల్స్ స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లించారు. పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పైప్ లైన్ లీకేజీ, శానిటేషన్ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ఈ కార్యాలయ హెల్ప్‌లైన్ 08814-273332 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ సునీల్ ఉన్నారు.

1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జులై 1వ తేదీన పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. శనివారం వెలగపూడి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ విసి హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరిస్తూ జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద జులై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఒకటో తేదీనే 100 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని తెలిపారు. దీనికి సంబంధించి బ్యాంకు నుంచి నగదు కూడా విత్ డ్రా చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాధికారి కెసిహెచ్.అప్పారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ దస్త్రాల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నరసాపురం పార్లమెంట్, ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను నరసాపురం పార్లమెంటు, నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా, మోహాల్ అగర్వాల్, విక్రమాదిత్య మీనా పరిశీలించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నరసాపురం పార్లమెంటు, ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను నరసాపురం పార్లమెంటు వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా, నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మోహాల్ అగర్వాల్, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు విక్రమాదిత్యా మీనా స్వీకరించారు. అభ్యర్థుల పార్టీ ప్రచారంలో చేసిన ప్రచురణలు, ర్యాలీలు, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, సభలు, సమావేశాలు, రోడ్ షోలు, వాహనాలు, తదితర ప్రచార ఖర్చుల దస్త్రాలను వారు క్షుణంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పియూష్ శుక్లా మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్, ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను స్వీకరించినట్లు తెలిపారు. పూర్తి అధ్యయనం చేసి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పూర్తిస్థాయి నివేదికలను అందజేస్తామన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ సి.నాగరాణిని వారు కలిశారు. ఈ సమావేశంలో జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇండియన్ డిజిటల్ స్కూల్‌కు అనుమతుల్లేవ్ : ఎంఇఒ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో నూతనంగా తమ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్న ఇండియన్ డిజిటల్ స్కూల్‌కు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని ఎంఇఒ రవీంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల ప్రారంభానికి ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు ఉండాలన్నారు. అనుమతులు లేని పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పొద్దని తెలిపారు. అనుమతులు లేని పాఠశాలలు ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా ఉంటాయని తెలిపారు. అటువంటి పాఠశాలల వల్ల విద్యార్థులు నష్టపోతారన్నారు. వాటికంటే ప్రభుత్వ పాఠశాలలో ఆటలు, పాటలు అన్నీ బాగుంటాయన్నారు. మంచి విద్యాబోధన ఉచిత స్టూడెంట్ కిట్లు, చక్కటి క్రీడా ప్రాంగణాలు ఎన్నో సదుపాయాలతో ప్రభుత్వం ఉన్నత విద్యనందిస్తోందని చెప్పారు. అనుమతులు లేని పాఠశాలల్లో చేరొద్దని ఆయన హితవు పలికారు.

స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం వీరవాసరం మండల కమిటీ సమావేశం జుత్తిగ నరసింహ మూర్తి అధ్యక్షతన భీమవరం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ ప్రజా సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆ రోజు 60 గ్రామాల ప్రజలు, రైతులు 19 వేల ఎకరాల పంట, నివాస భూమిని త్యాగం చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారన్నారు. ఆశలను అడియాశలు చేసి స్టీల్ ప్లాంట్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి దాన్ని దెబ్బతీయాలని చూడడం దారుణమన్నారు. ఒకవైపు బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తూ తిరిగి బిజెపి ఎంపీ పురంధేశ్వరి ఉక్కు, గనుల శాఖామంత్రులను కలిసి వినతిపత్రాలు ఇవ్వడం సిగ్గుచేటు అని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అన్ని విధాలా రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయంపై నోరు మెదపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తక్షణం విశాఖ ఉక్కు ఆస్తుల అమ్మకాన్ని ఆపేలా చర్యలు తీసుకోవాలి కోరారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వాలు సామాన్యులపై ధరల భారాలు తగ్గించాలని కోరారు.

రైళ్లను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం రైల్వే స్టేషన్ నుంచి గతంలో ఉన్న రైళ్లను పునరుద్ధరించాలని నెక్కంటి క్రాంత్‌కుమార్ అన్నారు. శనివారం నరసాపురం రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం వెళ్లే రైలును వెంటనే పునరుద్ధరించాలన్నారు. తిరుపతి, బెంగళూరు, చెన్నయ్ రైళ్లల్లో రిజర్వేషన్ బోగీలు పెంచాలని, సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆశ.. నిరాశ..!



ఆశ.. నిరాశ.. ఈ రెండూ సగటు మానవుని జీవితంలో అంతర్భాగం. పాలకుల హామీలతో ప్రజలు ఎక్కువ కాలం ఆశలతో జీవించడం, అదే పాలకుల విధానాలతో నిరాశకు గురికావడం పరిపాటైంది. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఈ కాలంలో నెలకొంది. 'ప్రతి సోమవారం.. పోలవరం' అంటూ సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన సోమవారం చంద్రబాబు పోలవరంలో పర్యటించి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆనక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియలో పోలవరం ప్రాజెక్టు పనులపైనే చంద్రబాబు కేంద్రీకరణ ఎక్కువ సాగింది. నిర్వాసితులకు సంబంధించి పరిమితమైన సమీక్ష జరిగింది. ఈ దశలో తాజాగా పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిలో పోలవరం డ్యామ్ పనులకు సంబంధించి తప్ప నిర్వాసితుల ఊసే లేదు. అంటే గతంలో వలే చంద్రబాబు డ్యామ్ పనులపై పెట్టిన దృష్టి నిర్వాసితులపై పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లాలోని పోలవరం నిర్వాసితుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. గతంలో జగన్ కూడా అనేక హామీలిచ్చి అధికారంలోకొచ్చాక వారి మాటే వినే ఆలోచనే చేయలేదు. పైగా ఏజెన్సీలో సిఎం పర్యటనకు ముందు కొంతమందికి పరిహారపు సొమ్ము జమ చేయడం, వారినే సిఎం సభకు అనుమతించి మిగిలిన గ్రామాలపై తీవ్ర నిర్బంధం విధించడం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో నిర్వాసితులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంపై నిర్వాసితులు పెట్టుకున్న ఆశలు ఏ మాత్రం నెరవేరుతాయో వేచిచూడాలి. ప్రస్తుతానికి మాత్రం పోలవరంలో సిఎం చంద్రబాబు పర్యటన, పోలవరంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా నిర్వాసితుల ప్రస్తావన కనీసంగా లేకపోవడం మాత్రం ముంపు బాధితులను తీవ్ర నిరాశకు గురి చేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

దెందులూరు మండలం దోసపాడులో పెద్దల చెరలో ఉన్న అసైన్డ్ భూములను హక్కుదారులకే అప్పగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చాలాకాలంగా పోరాటం జరుగుతోంది. కోర్టు తీర్పులను సైతం అధికారులు అమలు చేయని పరిస్థితి ఉంది. వాస్తవ హక్కుదారులను కనీసం భూముల వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని కేసులు బనాయించడం, ఆక్రమణదారులకు రాచమార్గం కల్పించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. 2016లో లోకాయుక్త ఇచ్చిన తీర్పు అమలు చేయాలనేది పేదలు, దళితుల డిమాండ్. నాటి నుంచి ప్రభుత్వ నిర్బంధం, ఆక్రమణదారుల దాడులను ఎదుర్కొంటూనే వారంతా ఐక్యంగా తమ పోరాటం సాగించారు. ఎట్టకేలకు జాయింట్ కలెక్టర్ కోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ భూములు అసైన్డ్‌దారులకే చెందుతాయని స్పష్టం చేసి, అసైన్డ్ హక్కుదారులకు ఆ భూములు అప్పగించాలని ఆదేశించింది. ఇది అపూర్వ విజయం. అక్కడి పేదలు, దళితుల్లో ఆశలు చిగురించాయి. అయితే ఈ ఉత్తర్వులు అధికార యంత్రాంగం ఎప్పటికి అమలు చేస్తుందనే అనుమానమూ వాస్తవ హక్కుదారుల్లో నెలకొంది. వీలైనంత వరకూ జెసి కోర్టు తీర్పును అమలు చేయకుండా జాప్యం చేయడమే అధికారుల తీరులా కన్పిస్తుందనేది వారి వాదన. అదే జరిగితే తాము మరో పోరాటానికి సిద్ధమని పేదలు, దళితులు స్పష్టం చేస్తున్నారు. ఏదైనా పోరాటాల ద్వారానే తమ హక్కులు, ఆస్తులు రక్షించుకోవచ్చని దోసపాడు పేదలు, దళితులు మరోసారి నిరూపించారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

కూలీల సంఖ్యను బట్టి పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం: ఆయకట్టుతో సంబంధం లేకుండా గ్రామంలో ఉన్న కూలీల సంఖ్యను బట్టి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా శనివారం తాడేపల్లిగూడెం మండలం నందమూరి గ్రామంలో ఉపాధి పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తమ గ్రామంలో 15 రోజులకు మించి పని చెప్పలేదని, గ్రామ ఆయకట్టుతో ముడిపెట్టి గ్రామానికి 4 వేల పని దినాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయ పనుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో నాట్లు, ఇతర అన్ని రంగాల్లోనూ వలస కూలీలే ఉంటున్నారని, తమకు ఉపాధి పనులు తప్ప వేరే పనులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు సమగ్రంగా పనులు కల్పించే దిశగా ఆలోచించి, పనులు కల్పించాలని, గ్రామంలో ప్రత్యామ్నాయం పనుల కల్పనకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసేలా కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రొక్కం కనకమాలక్ష్మి, కండెల్లి వెంకటరావు, కంకిపాటి రవి, అమ్మాజీ ఉన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేయాలి : ఎంఎల్ఎ

నరసాపురం: రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని వేములదీవి పడమర గ్రామంలో ఆదివారం సెంటర్లో రోడ్డు మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈమేరకు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఉమ పాల్గొన్నారు.

రాజ్యాంగానికి బిజెపి తూట్లు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం

భీమవరం టౌన్: రాజ్యాంగాన్ని తూట్లు పొడిస్తుంది బిజెపినేనని, రాజ్యాంగాన్ని కాపాడేది ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని కాంగ్రెస్ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ హయాంలోనే వంద ఎమర్జెన్సీలు వస్తున్నాయ్ అని, కాంగ్రెస్ ఎదుగుదల ఓర్వలేక కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని, కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అప్పటి బిజెపి నేత వాజ్ పేయి విమానం కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేసినప్పుడు ఇందిరా గాంధీని దుర్గామాతతో పోల్చారని, బిజెపి నేతలకు ఆ విషయం గుర్తు లేదా? సభలో ప్రధాని మోడీ ఎందుకు ప్రస్తావించలేదని సీతారాం ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షులు సోమ నాగ కేశవబాబు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలలో డేటా సైన్స్ కోర్స్ ప్రారంభం

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ స్థాయిలో డేటా సైన్స్ కోర్స్‌ను నూతనంగా ప్రారంభించినట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన విద్యా సంవత్సరంలో డిగ్రీ స్థాయిలో బిఎస్‌సి డేటాసైన్స్ కోర్స్‌ను ప్రారంభించుటకు యూనివర్సిటీ అనుమతి లభించిందని, ఈ సంవత్సరం నుంచే ఈ కోర్స్‌లో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్స్ చేయడం వల్ల విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డేటా సైన్స్ అనేది బాగా ఉపయోగపడుతుందని తెలిపారు.

అంగన్వాడీలకు న్యాయం చేస్తాం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: తమ న్యాయమైన కోరికల కోసం గత ప్రభుత్వంలో సమ్మె చేసిన అంగన్వాడీలకు న్యాయం చేస్తామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అంగన్వాడీ సంఘ నాయకులు శనివారం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం నిరంతరం పాటుపడుతున్న అంగన్వాడీలకు తగిన గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వం దృష్టికి అంగన్వాడీ సమస్యలను తీసుకువెళ్తామని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా వెనకబాటుతనంగా ఉన్న కారణంగా న్యాయం చేసేందుకు కొంచెం సమయం పట్టినా.. అంగన్వాడీలు ప్రజా సేవలో ముందుండాలని సూచించారు.

3న రేవు నిర్వహణ బాధ్యతలు

నరసాపురం: మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవును వచ్చేనెల 3 నుంచి మండల పరిషత్ అధికారులు స్వాధీనం చేసుకొని రేవు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారని జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సోని అధ్యక్షతన జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నారు. రేవు పాటదారుడు రెడ్డప్ప ధవేజీ చెల్లించాల్సిన బాకీ రూ.53.14 లక్షలపై మరోసారి జెఎసి సమావేశమయ్యారు. ఈనెల 21న రూ.35 లక్షలు చెల్లిస్తామని ధవెజి జెఎసికి ఇచ్చిన హామీకి అనుగుణంగా సొమ్ము చెల్లించలేదు. బాకీ మొత్తం పెరగడంతో రేవు నిర్వహణ బాధ్యతలు, పాటదారుడుపై తీసుకోవాల్సిన చర్యలు, తదితర విషయాలపై కమిటీ సభ్యులు చర్చించారు. అతనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని జెఎసి సభ్యులు తీర్మానించి జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో డిఎల్‌పిఒలు యు.శ్రీనివాస్, బొజ్జిబాబు, ఎంపిడిఒ రమణరావు, జెడ్‌పిటిసి రాధాకృష్ణ, ఎంపిపి మల్లికార్జునరావు, సర్పంచి రేపూరి ఏసునర్సింహారాజా పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు విలువ కట్టలేం

ఆకివీడు : ప్రభుత్వానికి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులు ఉద్యోగ విరమణ చేయడం ఆనందం కన్నా బాధ ఎక్కువగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. అటువంటి వారి సేవలకు విలువ కట్టలేమన్నారు. ఈనెల 30వ తేదీ ఆదివారంతో మండలంలోని చెరుకుమిల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఆయనకు వీడ్కోలు పలికారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సేవలను కొనియాడుతూ ఎండిఒ కార్యాలయ సిబ్బంది చెరుకుమిల్లి సచివాలయ సిబ్బంది, పలువురు మాట్లాడారు. అనంతరం ఆయనకి సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

అంబేద్కర్ పేరు కొనసాగించడంపై హర్షం

వీరవాసరం: గత టిడిపి ప్రభుత్వంలో పెట్టిన అంబేద్కర్ విదేశీ విద్యా పథకం పేరును వైసిపి ప్రభుత్వం జగనన్న పేరు పెట్టుకుని అంబేద్కర్‌ను అవమానించారని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఈమేరకు శనివారం ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసినట్టు తెలిపారు. చంద్రబాబు సిఎం అయ్యాక తిరిగి అంబేద్కర్ విదేశీ విద్య పేరు పున: ప్రారంభించినందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగులు, యువత, టీచర్స్‌కి ఇచ్చిన హామీల మేరకు సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్న లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

ఇంటర్న్ షిప్ ప్రారంభం

ఆకివీడు: దుంపగడప విరిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధునాతన రీతిలో విద్యార్థులకు విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. నూతన విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభంకానున్న దృష్ట్యా శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో డిగ్రీ అయిన విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ప్రారంభించామన్నారు. కంప్యూటర్ ల్యాబ్స్ డిజిటల్ లైబ్రరీ, అది పెద్ద క్రీడా ప్రాంగణం, ఓపెన్ జిమ్, వృత్తి శిక్షణ నైపుణ్య కేంద్రం వంటి అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీ పరీక్షలకు ఉత్తమ ఉన్నత శిక్షణ స్థాయి ప్రమాణాల పెంచేందుకు ఎన్ఎస్ఎస్ శిక్షణ వంటి అనేక సదుపాయాలన్న తమ కళాశాలలలో నూతన గ్రూపులను కూడా ప్రారంభిస్తున్నామని ఆమె తెలిపారు. తమ కళాశాలలోని విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఉందని పరిసర గ్రామ ప్రజలకు ఉచిత రవాణా సౌకర్యం ఉందని, ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నరసాపురం: మండలంలో విద్యుత్ షాక్ గురై చెరువు వద్ద పనిచేసే వ్యక్తి మృతి చెందారు. దీనికి సంబంధించిన స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములదీవి తూర్పు గ్రామంలో కొపనాతి అప్పన్న(55) చెరువులు వద్ద కాపలా కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం అర్ధరాత్రి చెరువుల వద్దకు వెళ్లాడు. శనివారం ఉదయం చెరువుల వద్దకు వెళ్లిన గ్రామస్థులుకు కరెంట్ షాక్‌తో మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అప్పన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
నూజివీడు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్
రూరల్ కేంద్రాలు: దెందులూరు, పెదవేగి, విజయరాయి, ఏలూరు, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, వేలేరుపాడు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, అత్తిలి, ఇరగవరం, నరసాపురం, భీమవరం, ఆకివీడు, మొగల్తూరు
ఇంటర్వ్యూ : తేది: 01-07-24 సోమవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారివీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

కలెక్టర్‌ను కలిసిన గ్రామ రెవెన్యూ అధికారులు

పెనుమంట్ర : నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షులు బి.రవీంద్ర రాజు శనివారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు, జిల్లాలోని విఆర్‌ఒలు అందరూ పూర్తిగా సహకరిస్తారని తెలిపామన్నారు. విఆర్‌ఒల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి, విఆర్‌ఒల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ అన్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలసిన వారిలో జిల్లా, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల్ల జకరయ్య, నరసాపురం డివిజన్ అధ్యక్షులు కెవివి సత్యనారాయణ, భీమవరం డివిజన్ జాయింట్ సెక్రటరీ వి.ముత్యాల రావు, మండల అధ్యక్షులు ఆర్.రత్న రాజు, అత్తిలి మండల అధ్యక్షులు బి.బాబులు ఉన్నారు.

30.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంలో గడిచిన 24 గంటల్లో అత్యధికంగా 30.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. అత్యల్పంగా భీమవరంలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 8.6, ఆచంట 8.0, ఇరగవరం 7.2, కాళ్ల, తణుకు 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లాలోని మొత్తం 20 మండలాల్లో 101.4 మిల్లీమీటర్ వర్షం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా యావరేజ్ వర్షపాతం 5.1 మిల్లీమీటర్లు నమోదైంది.

కుళాయి చెరువు పరిశీలించిన ఎంఎల్ఎ

నరసాపురం: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని కుళాయి చెరువును శనివారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. తాగునీటిని పరిశీలించి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ లోకేష్‌ని ఆదేశించారు. అనంతరం లక్ష్మణేశ్వరం చెరువు పక్కన ఉన్న కాలనీని పరిశీలించారు. స్థానిక సమస్యలను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ ఎంఎల్ఎకు వివరించారు. తాగునీరు, విధి దీపాలు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కరిస్తానని ప్రజలకు నాయకర్ భరోసా ఇచ్చారు.

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి : ఎంఎల్ఎ

ఆచంట: అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని వల్లూరు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు శనివారం పితానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం నెలలో 25 రోజులపాటు అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న బాలింతలు గర్భిణీ స్త్రీలు, చిన్నారుల రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియపరచాలని ఆయన సూచించారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనిశెట్టి పద్మావతి, బి.కమల, వైబిటి సుందరి ఉన్నారు.

ల్యాబ్‌రేటరీ ప్రారంభం

తణుకు : విద్యార్థులు మంచిగా చదువుకుని, డిగ్రీ తర్వాత కూడా ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో (డిఎస్‌టి-ఎస్ఇఆర్‌బి) న్యూఢిల్లీ వారి రూ.30 లక్షల ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దఫాలో విడుదలైన రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన కెమిస్ట్రీ రీసెర్చ్ ల్యాబ్‌రేటరీను, ఆర్గానిక్ కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కళాశాలలో వసతులు కల్పించడానికి పూర్తి సహకారాలు అందజేస్తానన్నారు. కళాశాలలో 1971-76 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థి డాకెవి.రావు కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌కు వంద కుర్చీలను అందజేసినందుకు అభినందనలు తెలిపారు.

'అధికారుల సహాయ సహకారాలు మరువలేనివి'

ఉండి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదని ఉండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శనివారం ఉండి కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో ఎన్నికలు సమర్థవంతంగా, విజయవంతంగా ముగించినందుకు సహకరించిన సిబ్బందికి, అధికారులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్న సివి ప్రవీణ్‌ఆదిత్య మాట్లాడుతూ ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ పత్రాల దాఖలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

పలు సేవా కార్యక్రమాలు

పాలకొల్లు : వాసవి క్లబ్ ఆధ్వర్యాన సోషల్ యాక్టివిటీస్‌లో వివిధ వర్గాలకు చేయూత నిచ్చారు. అంధులకు చేతి కర్రలు, వీధి వ్యాపారులకు గొడుగులు, విద్యార్థులకు స్టేషనరీ కిట్స్ ఇచ్చి ప్రోత్సహించారు.

'ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటేనే తగిన గుర్తింపు'

భీమవరం టౌన్: ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటేనే తగిన గుర్తింపు లభిస్తుందని, సీనియర్ ఉద్యోగుల నుంచి ప్రతి విషయాన్ని అవగతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టరేటు మెజిస్టీరియల్ సూపరిటెంటు టిఎ.కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్యలు పాల్గొని పూల మాలలు, శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సుదీర్ఘంగా 38 సంవత్సరాలు వివిధ హోదాలో పనిచేయడం అభినందనీయమని, వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

1న ఇంటివద్దే పింఛన్ల పంపిణీ

నరసాపురం: తక్కువ సమయంలోనే ఎక్కువ లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమీషనర్ ఆధ్వర్యంలో సచివాలయముల సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చేనెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటలకల్లా 95 శాతం టార్గెట్ పెట్టుకొని టార్గెట్ పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. ఎక్కువ మొత్తంలో పింఛన్లు డ్రా చేస్తున్నందున చెల్లింపు సిబ్బందికి సెక్యూరిటీగా పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మొగల్తూరు : సంక్షేమ పింఛన్ లబ్ధిదారులకు ఒకటవ తేదీన ఇంటింటికీ నగదు పంపిణీ చేయనున్నామని ఎంపిడిఒ యు.బాబ్జి రాజు తెలిపారు. పెన్షన్ పంపిణీకి సచివాలయ, పంచాయతీ సిబ్బందిని నియమించామన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెంది ఎక్కడికి వెళ్లవలసిన అవసరం లేదని ఆయన సూచించారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ.7 వేలు, పక్షవాత బాధితులకు రూ.10 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛన్లు అందించనున్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు సామాగ్రి అందజేస్తున్న పట్టాభిరామయ్య

కాళ్ల: సామాజిక స్పృహతో విద్యను ప్రోత్సహించడం తన బాధ్యత అని, విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి పౌరులుగా తమ భవిష్యత్ జీవితాన్ని అభివృద్ధి చేసుకోవాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య అన్నారు. శనివారం పంచాయతీ మేకలదిబ్బ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా విషయక సామాగ్రి పంపిణీ చేశారు. తన స్వస్థలం మేకలదిబ్బ గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పుస్తకాలు, ఇతర సామాగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా పట్టాభిరామయ్య మాట్లాడుతూ తన మూలాలను మరచిపోకుండా ప్రతిఒక్కరూ విద్యను ప్రోత్సహించడం అవసరమన్నారు. గత సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గత కొంతకాలంగా ప్రతి సంవత్సరం మాలవానితిప్ప హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఎంతో ఉపయోగమైన యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెల్లబోయిన యశ్వంత్, భరత్ మాతాజీ, అరేటి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట వెంకటరామ్, ఉపాధ్యాయులు పాలనాగ శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

'అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలి'

నరసాపురం: ప్రభుత్వ అధికారులు వారి పనిపట్ల చిత్త శుద్ధితో పనిచేయాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని నర్సాపురం నియోజకవర్గ ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం నర్సాపురం మండలం, లక్ష్మణేశ్వరం గ్రామ పంచాయతీకి సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఎంఎల్ఎ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీరు, రెవెన్యూ, విద్యుత్, సానిటేషన్ మొదలగు ప్రజా సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా, దానిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో లక్ష్మణేశ్వరం గ్రామ సర్పంచి తిరుమాని వెంకటరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరావు, జెఇ లోకేష్, విఆర్‌ఒ చిరంజీవి పాల్గొన్నారు.

చేనేత నేత తమ్మా చిట్టి కోటేశ్వరరావు మృతి

కోటేశ్వరరావు(ఫైల్)

పాలకొల్లు : సిపిఎం సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు తమ్మా చిట్టి కోటేశ్వరరావు(90) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటేశ్వరరావు హటాత్తుగా శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జిల్లా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు ఉద్యమాలు నిర్వహించారు. చేనేత కార్మికుల ఐక్యతకు కృషి చేసారు. దగ్గులూరు గ్రామంలో ప్రజాసమస్యలపై పనిచేశారు. కోటేశ్వరరావు భౌతికాయంపై మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ సిపిఎం జెండా కప్పి నివాళులు అర్పించారు. ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. భౌతిక కాయం సందర్శించి నివాళులు అర్పించిన వారిలో ప్రజా నాయకులు చల్లా సోమేశ్వరావు, ఎస్.పురుషోత్తం, వై.అజయ్ కుమార్, శంకరం ఉన్నారు.

చిట్టి కోటేశ్వరరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.పెద్దిరాజు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, ఏలూరు జిల్లా నాయకులు ఆదిశేషు, చేతివృత్తి దారుల సంఘం జిల్లా నాయకులు జె.నరసింహ మూర్తి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నిబంధనలకు తూట్లు : ఎస్‌ఎఫ్ఐ

ఉండి: మండల కేంద్రంమైన ఉండిలోని ఇండియన్ డిజిటల్ పాఠశాలలో విద్యా వ్యాపారాన్ని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ శనివారం అడ్డుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులకు విద్యా వ్యాపారన్ని అడ్డుకోవలసిందిగా ముందస్తుగానే వినతిని ఇచ్చి కోరినా వారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఇండియన్ డిజిటల్ పాఠశాలతో పాటు మండలంలో ఉన్న ఇతర ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు సైతం పక్కనపెట్టి విద్య వ్యాపారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు స్పందించకపోవడం చూస్తే ప్రయివేట్ యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కైనట్లు అనిపిస్తుందని అన్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి మండలంలోని విద్యా వ్యాపారం గురించి తీసుకువెళ్లేందుకు ఎస్ఎఫ్ఐ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అనంతరం ఎంఇఒ జ్యోతి ఇండియన్ డిజిటల్ పాఠశాలను తనిఖీ చేసి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.చందు, సహాయ కార్యదర్శి కె.గోవింద్, జిల్లా నాయకులు బి.గణేష్ పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ కార్యాలయాల శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఉన్నాయి. నరసాపురం మండలంలోని సారవ గ్రామంలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
సుదీర్ఘ విధి నిర్వహణ అనంతరం
మా 'శ్రీను' గ్రేడ్-1 కార్యదర్శిగా
పదవీ విరమణ చేయుచున్న
తరుణాన శుభాకాంక్షలందిస్తూ...
ఆయన శేష జీవితం
ఆయురారోగ్యాలతో
ఆనందమయం కావాలని ఆశిస్తూ...
శ్రీమతి & శ్రీ పొట్లచెర్వు శ్రీనివాస్, పద్మావతి
గ్రేడ్-1 పంచాయతి కార్యదర్శి, చెరుకుమిల్లి, ప.గో.జిల్లా
తల్లి: లింగవర్ధని, వదిన: గాయత్రి
బావగారు-అక్క: పండితారాధ్యుల శ్రీ సత్య సూర్యప్రసాద్, రిటైర్డ్ టీచర్ - సత్య మాణిక్యాంబ (లేటు)
తమ్ముడు-మరదలు: రాధాకృష్ణ, ఉండ్రాజవరం మండల బ్రాహ్మణ యువజన కన్వీనర్ - పి.ఎస్.కె.రాణి
తమ్ముని కుమారుడు-కుమార్తె: శ్రీకరప్రసాద్, మాస్ మ్యూచువల్ ఫండ్స్, హైదరాబాద్
ప్రియాంక మరియు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తాడిపర్రు

లోక్ అదాలత్‌లో పలు కేసులు రాజీ

తాడేపల్లిగూడెం: జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 184 పెండింగ్ కేసులు రాజీ కుదిరించినట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. ఈ లోక్ అదాలత్ 5 బించ్‌లుగా నిర్వహించారని తెలిపారు.

భీమవరం టౌన్: భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల్లో పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. కక్షిదారుల సౌకర్యార్థం కేసుల పరిష్కారం నిమిత్తం 5 బెంచ్‌లను ఏర్పాటు చేసారు. 197 కేసులు రాజీ అయ్యాయి.

నరసాపురం: స్థానిక కోర్ట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 109 కేసులో పరిష్కరించినట్లు నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయ దుర్గ తెలిపారు.

పాలకొల్లు: పాలకొల్లు న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 72 కేసులలో అవార్డులు జారీ చేశారు. మొత్తం రూ.45,56,085లు కక్షి దారులు పరిహారం అందుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లాకు నియమితులైన కలెక్టర్ సి.నాగరాణిని శనివారం జిల్లా ఎస్‌పి అజిత మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కి పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు.

'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

గణపవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిన అవసరం ఉందని గణపవరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.బాల భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. తమ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో ఎంపికైనట్లు చెప్పారు. స్కూల్‌లో లొకేషన్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు హిమగిరి, పిఎస్.కుమారి, శ్యామల, సీత, పద్మ కుమారి, వెంకటాచారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ పితాని విజయోత్సవ ర్యాలీ

పోడూరు: మండలంలో శనివారం స్థానిక ఎంఎల్ఎ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. విజయోత్సవ ర్యాలీ సందర్భంగా గ్రామాల్లోని టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, ప్రజలు ఎంఎల్ఎ పితానికి ఘన స్వాగతం పలికారు. పోడూరు మండలంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎంఎల్ఎ పితాని మధ్యాహ్నం కొమ్ముచిక్కాలలో తన నివాసం నుంచి విజయోత్సవ ర్యాలీని ప్రారంభించారు. పి.పోలవరం, కవిటం, జగన్నాథపురం, పండితవిల్లూరు, తూర్పుపాలెం, మినిమించిలిపాడు, పోడూరు గ్రామాల మీదుగా గుమ్మలూరు వరకు విజయోత్సవ ర్యాలీ జరిగింది.

జాబ్ మేళాలో 96 మంది ఎంపిక

నరసాపురం: వైఎన్ కళాశాలలో హెచ్ఆర్‌డి సెంటర్‌లో నేషనల్ కెరీర్ సర్వీస్ ఎంప్లాయిమెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 96 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు తెలిపారు. ఏడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 231 మంది హాజరయ్యారన్నారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరైయ్యారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ అభినందించారు.

నీటి నాణ్యత పరీక్షలు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి పంచాయతీనీ జిల్లా ఉప వైద్యాధికారి వి.ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా నీటి నాణ్యత పరీక్షలు చేసి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేయాలని ఎంఎల్‌ఎ హెచ్‌పిలను ఆదేశించారు.

జనసేనలోకి పలువురు

పాలకొల్లు : జనసేన విధానాలు నచ్చి అనేక మంది పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారని జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

హెచ్.ఎమ్.ఓ.పి. నెం. 211/2023

బిట్వీన్:

సుంకరి (అనే) గోపవరపు వెంకటలక్ష్మి, భర్త: సుంకరి భానుచందర్, హిందూ, స్త్రీ, వయస్సు 32 సం॥లు, డోర్ నెం. 5-9, నల్లజర్ల గ్రామం, నల్లజర్ల మండలం, తూ॥గో॥జిల్లా, టిపిజి/ఎస్‌సిజె. -పిటీషనర్

మరియు

సుంకరి భానుచందర్, S/o. చంద్రశేఖర్‌రావు, హిందూ, పురుషుడు, 35 సం॥లు, డిప్పకాయలపాడు గ్రామం, కొయ్యలగూడెం మండలం, తూర్పుగోదావరి జిల్లా, టిపిజి/ఎస్‌సిజె -రెస్పాండెంటు

పై నెంబరు గ్రంథములో పిటీషనర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికి మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. **10-07-2024వ తేదీ బుధవారం నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడేపల్లిగూడెం జి.వి.ద్వారకానాథ్
తేది:29-6-2024 పిటీషనర్ తరపు న్యాయవాది